క్లుప్తంగా

ఏటిగట్టు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

కాజులూరు: మండలంలోని పెదలంక వద్ద ఏటి గట్టుకు గండ్లు పడకుండా అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పెదలంక వద్ద గట్టు బలహీనంగా ఉన్నచోట గండ్లు పడే ప్రమాదం ఉందని, అదే జరిగితే మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా గండ్లు పడే అవకాశం ఉన్నచోట గట్లు పటిష్ట పరచాలని ప్రజలు కోరుతున్నారు.

కన్నబాబుకు చైర్‌పర్సన్ పరామర్శ



కన్నబాబును పరామర్శిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): పితృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబును బుధవారం కాకినాడలోని ఆయన నివాసంలో మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు. ఆయన తండ్రి కురసాల సత్యనారాయణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, నాయకులు సాధనాల శివ భగవాన్ ఉన్నారు.

ఉద్యోగుల ధర్నా



ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నేతలు

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జాతీయ సమాఖ్య ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం సాయంత్రం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని, పెన్షనర్ల వ్యాలిడిషన్ స్కీమ్ రద్దు చేయాలని, తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఈ రామచంద్రపురం శాఖ అధ్యక్షుడు కృష్ణ మోహన్ రావు, కార్యదర్శి రమణమూర్తి, కోశాధికారి రాంబాబు, పెన్షనర్ ఉద్యోగ సంఘాల నాయకులు రామగంగాధరం, పులేశ్వరరావు, రామారావు తదితరులు నాయకత్వం వహించారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

రామచంద్రపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 ఏడాది డిగ్రీలో ప్రవేశానికి అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుందని, రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, బీఏ , బీకాం, బీఎస్సీ గ్రూపులు కలవని తెలిపారు. కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఈ నెల 20 నుంచి 26 వరకు సమయం ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం: గ్రామంలోని శ్రీఅగస్త్యేశ్వర, పాపవినాశేశ్వర స్వామి ఆలయం, జనార్దన స్వామి ఆలయాలకు నియమించిన నూతన పాలకవర్గ సభ్యులు బుధవారం ఆయా ఆలయాల ప్రాంగణాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జోగేశ్వరరావు హాజరయ్యారు. అగస్త్యేశ్వర ఆలయం చైర్మన్‌గా పితాని రామచంద్రరావు, సభ్యులుగా బి.సూరిబాబు, పి.జ్యోతి, టి.వెంకటలక్ష్మి, కె.సతీష్, కె.నాగబాబు, వై.సీతారామం, వి.వీరవేణి, పి.చంద్రశేఖరరావు ప్రమాణం చేశారు. జనార్దన స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కె.అచ్యుతరామారావు, సభ్యులుగా జి.సూర్యనారాయణ మూర్తి, జె.చిరంజీవి, నూకరాజు, కె.శ్రీరామ వెంకట సత్య నాగమోహన్, జి.భవాని, సోమరాజు, వి.మంగ, కె.విజయలక్ష్మిదేవి ప్రమాణం చేశారు.

లంక గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి



మండల అధికారులు, పోలీసులకు సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి

కపిలేశ్వరపురం: వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో మండల, గ్రామ అధికారులు లంక గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని మండపేట నియోజకవర్గ ప్రత్యేకాధికారి, సివిల్ సప్‌లేస్ డీఎం శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక అధికారులతో కలిసి ఆయన మండలంలోని కేదారిలంక, వీధివారి లంక, అద్దంకివారిలంక గ్రామాల్లో పర్యటించారు. వరద ప్రభావిత చర్యలపై పలు సూచనలు చేశారు.

అంత దూకుడొద్దు..!

- బైక్‌తో విన్యాసాలు చేస్తున్న యువత
- మట్టి, ఇసుక ట్రాక్టర్లు నడుపుతున్న మైనర్లు
- రాంగ్ రూట్ ప్రయాణంతో ప్రమాదాలు



గొల్లపాలెంలో బైక్‌పై వెళుతున్న ఐదుగురు మైనర్లు



కాజులూరులో మట్టి ట్రాక్టర్ నడుపుతున్న బాలుడు

కాజులూరు: ప్రస్తుతం ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే బైక్ తప్పనిసరి. సైకిల్ వాడకం తగ్గిపోయింది. బైక్‌లు, కార్ల సంఖ్య పెరిగిపోయింది. రోడ్లన్నీ నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 15 ఏళ్లు నిండని మైనర్లు బైక్‌లతో వీధుల్లోనే కాక ప్రధాన రహదారుల్లో సైతం రాకపోకలు సాగిస్తున్నారు. రయ్.. రయ్.. అంటూ దూసుకుపోతున్నారు. అదే విధంగా మట్టి, ఇసుక ట్రాక్టర్లను కూడా మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నారు. మైనర్లకు రోడ్ నిబంధనలు, జాగ్రత్తలపై అవగాహన లేక ఇష్టానుసారంగా నడపడంతో వాహనాదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారు. అబ్బాయిలు బైక్‌పై, అమ్మాయిలు స్కూటీలతో ప్రధాన రోడ్లపై ప్రయాణిస్తున్నారు. ఒకే బైక్ పైపై ముగ్గురు, నలుగురు ఎక్కి ప్రయాణిస్తున్నారు. పలువురు బైక్‌తో విన్యాసాలు చేస్తూ ఇతర వాహనదారులను హడలెత్తిస్తున్నారు. ఒక్కోసారి వాహనం గేరు మార్చడానికి, షడన్‌గా ముందు మరో వాహనం వస్తే బ్రేక్ వేయాడానికి కూడా అవకాశం లేని విధంగా మెరుపు వేగంతో దూకుడుగా వెళ్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. ఇటీవల కాలంలో పోలీస్ బీట్లు విస్తృతం చేశారు. నిత్యం వివిధ కూడళ్లు, ప్రాంతాల్లో పోలీసులు విధులు నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నా, నిబంధనలు పాటించకపోయినా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పలువురిపై కేసులు నమోదు చేసి ఫైన్లు వేస్తున్నారు. అయినా అనేక మంది నిబంధనలు పాటించడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా

తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇస్తున్నారు. పిల్లలు బైక్‌లు నడిపేస్తున్నారని మురిసిపోతున్నారు. వారిని వివిధ పనుల నిమిత్తం బైక్స్ ఇచ్చి బయటకు పంపుతున్నారు. పిల్లలు బైక్ డ్రైవ్ చేసే ఆనందం తమ పిల్లలు మేజర్స్ అయ్యే వరకూ ఆ వీధికే పరిమితం కావాలి. తల్లిదండ్రులు తమ పిల్లల వెంటే ఉండి జాగ్రత్తలు తీసుకుంటూ డ్రైవ్ చేయించాలి. కానీ, పలువురు తల్లిదండ్రులు అలా చేయట్లేదు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం మోటార్ వాహన చట్టం ప్రకారం నేరం. ఇది తెలిసినా చాలా మంది తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. దాంతో పూర్తిగా అనుభవం లేకుండా వాహనాలు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. నిబంధనలు పాటిస్తూ రోడ్లపై వెళుతున్న వాహనదారులను మైనర్లు నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని నడిపి ఢీకొడుతున్నారు. ప్రమాదాలకు గురై తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మోటార్ సైకిల్స్ డ్రైవింగ్లో నిబంధనలు అతిక్రమిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవు. ముఖ్యంగా మైనర్లకు బైక్ ఇవ్వడం మోటార్ వాహన చట్టం ప్రకారం నేరం. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం, జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు ఎక్కడికక్కడ పోలీస్ స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించి వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించడం, జరిమానాలు విధించటం చేస్తున్నాం. ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ విషయంలో తల్లిదండ్రులు కూడా బాధ్యులవుతారు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

–మోహన్‌కుమార్, ఎస్సై, గొల్లపాలెం.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

కపిలేశ్వరపురం: సామూహిక ప్రయత్నంతోనే దోమల నివారణ సాధ్యపడుతుందని వైద్య శాఖాధికారులు అన్నారు. మండలంలోని అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లో బుధవారం అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్న కుమారి పర్యవేక్షణలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీపీ సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లిఖార్జునుడు పాల్గొన్నారు.

ద్వారపూడిలో..

ద్వారపూడి పీహెచ్‌సీ వైద్యులు జగదీప్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ వీధుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది దోమల నివారణ చర్యలపై నినాదాలు చేశారు. ప్రధాన కూడళ్లలో దోమల ప్రభావిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ, హెచ్ఎం రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి ఆద్యుడు రాజీవ్ గాంధీ

కపిలేశ్వరపురం (మండపేట): దేశంలో టెక్నాలజీకి ఆద్యుడిగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చరిత్రలో గుర్తుండిపోతారని ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు అన్నారు. మండపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాల్లో కామన మాట్లాడారు. రాజీవ్ ఆలోచనలు భారతదేశ అభ్యున్నతికి ఉపకరించిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మగ్గం రాజు, నాయకులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట



పందిరి రాట ముహూర్త పూజలో పాల్గొన్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని నాలుగో వార్డులో తర్వాణి పేటలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆవరణలో బుధవారం చవితి ఉత్సవాల రాట ముహూర్తం పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి హాజరై కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుండు రామతులసి, నిర్వహణ కమిటీ సభ్యులు గుండు వీర తాతరాజు పాల్గొన్నారు. అదే విధంగా ద్వారపూడిలోని బంగారమ్మ కాలనీలో బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర ఉత్సవాల పందిరి రాట ముహూర్తం పూజలు చేశారు.

ప్రారంభమైన చవితి సందడి

కాజులూరు: గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే ప్రారంభమైంది. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిష్టించే విగ్రహాలను భక్తులు ఆలయాల వద్దకు చేరుస్తున్నారు. ఈనెల 27 నుంచి గణపతి ఉత్సవాలు జరగనున్నాయి. సుందరమానంగా చూపరులను ఆకర్షించే విధంగా వినాయకుడి విగ్రహాలను నిర్వాహకులు ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తారు. ఇందుకోసం పలుచోట్ల ఇప్పటినుంచే విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఉత్సవాలు దగ్గరకు వచ్చే కొద్దీ తయారీదారులు విగ్రహాల ధరలు పెంచేస్తూన్నారని, అందుకే ముందస్తుగా విగ్రహన్ని తెస్తున్నామని ఆర్యావటం కొళ్లతూము సెంటరులోని సిద్ధి వినాయక కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రశ్నోత్తరాలతో వాడీవేడిగా సమావేశం

- కార్యదర్శులు వర్క్ ఆర్డర్ ఇవ్వట్లేదన్న ఎంపీటీసీలు
- అధికారుల తీరుపై జెడ్పీటీసీ, ఎంపీపీ ఆగ్రహం
- 'తూర్పు'లో విలీనానికి పరిషత్ తీర్మానం ఏకగ్రీవం



ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్న ఎంపీపీ సత్యవేణి

కపిలేశ్వరపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం వాడీవేడిగా సాగింది. స్థానిక ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అజెండా అంశాలను వెల్లడించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ రామకృష్ణ ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడారు. పలు అశాలపై ఎమ్మెల్యే వేగుళ్లతో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు తీవ్రస్థాయిలో వాదనకు దిగారు. ఎంపీపీ సత్యవేణి మాట్లాడుతూ, పరిషత్ పాలనా కాలం సుమారు ఏడాది మాత్రమే ఉన్నందున ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లో పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కాగా, ఆయా పనులకు గ్రామ కార్యదర్శులు వర్క్ ఆర్డర్‌లు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని, అందుకు టేకిలోని పరిస్థితి ఒక ఉదాహరణ అన్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి అభివృద్ధికి సహకరించాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, కోరుమిల్లి సర్పంచ్ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ హయాంలో కూటమి ఎంపీటీసీ సభ్యులను, ఎమ్మెల్యే వేగుళ్లను అవమానపర్చారన్నారు. బహిరంగ సమావేశ వేదిక్పై కింద కూర్చోబెట్టారని ఆరోపించారు. దీనిపై ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ, వేదిక్పై ఎమ్మెల్యేను తాము కింద కూర్చోబెట్టలేదని, ఆయనే ఉద్దేశపూర్వకంగా అలా కూర్చున్నారని సమాధానమిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా తనతో సహా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులకు ప్రోటోకాల్‌ను అమలు చేయట్లేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో వర్క్ చేయమని అడిగిన టీడీపీ, జనసేన సభ్యులకు కూడా వర్క్స్ కేటాయించామన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడు అబ్బు మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో పనిచేసే క్రమంలో రాజకీయాలు, పట్టింపులు అవసరం ఉండదన్నారు. ప్రభుత్వం మారినప్పటికీ తాము ప్రజలు కోసం పనిచేస్తామన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో క్షేత్ర స్థాయిలో ప్రజలకు నేరుగా సంక్షేమం అందిందన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు అవినీతికి పాల్పడకుండా సేవ చేశారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇసుకను ఇష్టానుసారం దోచేస్తున్నారని, గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా అమ్ముతున్నారని, బెల్ట్ షాపులు జనవాసాల్లో కొనసాగుతున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ హయాంలో తనతో సహా కూటమి ప్రజాప్రతినిధులను విస్మరించారన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకు తానే వర్క్ ఆర్డర్లను నిలుపుదల చేయించానని పేర్కొన్నారు. మండల పరిషత్ గ్రాంట్‌లో 50 శాతం నిధులు ఎమ్మెల్యేగా తనకు కేటాయించగలిగితే ఆ నిధులను ఇదే మండలంలో ఖర్చు చేస్తానన్నారు. ప్రతిగా ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ సభ్యులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తరపున మంజూరవుతున్న ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు హక్కు ఉంటుందన్నారు. ఆ నిధుల్లో కనీసంగా 25 శాతం నిధులను మండల పరిషత్‌కు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. నిధుల కేటాయింపుల సమస్య ఎటూ తేలకుండా సమావేశం ముగిసింది.

'తూర్పు'లో విలీనానికి తీర్మానం ఏకగ్రీవం

మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసేందుకు మండల పరిషత్ సభ్యులు తీర్మానం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. సభ్యులు అందుకు సమ్మతిస్తూ ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వండి



మాచవరంలో ఉల్లికోడును పరిశీలిస్తున్న రమేష్‌కుమార్

రాయవరం: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలని ఆలమూరు సబ్ డివిజనల్ ఏడీఏ కేవీఎస్ చౌదరి పిలుపునిచ్చారు. మండలంలోని మాచవరం, వి.సావరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కావాల్సిన ఆహార ధాన్యాలు ఉన్నప్పటికీ, వాటిలో ఉండే రసాయనిక, పురుగు మందుల అవశేషాలు అధికంగా ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నట్లు తెలిపారు. సొంత పొలం ఉన్న ప్రతి రైతు కొద్ది మొత్తంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి, కుటుంబ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ఎరువులు, పురుగు మందులు ఉపయోగించని ఆహార ధాన్యాలను తీసుకోవాలన్నారు. దీని వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. మోతాదుకు మించి పొలంలో పురుగుమందులు పిచికారీ చేయడం వల్ల పొలానికి మేలు చేసే మిత్ర పురుగుల సంఖ్య తగ్గిపోతుందన్నారు.

ఉల్లికోడు సమస్య

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరి పొలాల్లో ఉల్లికోడు సమస్య వస్తుందని రైతులు తెలిపారు. ఉల్లికోడు నివారణకు యూరియా వాడకాన్ని తగ్గించాలని, ఎకరానికి 10 కేజీల కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలను వాడాలని ఏఓ రమేష్‌కుమార్ తెలిపారు. మాచవరం, వి.సావరం పీఏసీఎస్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, పిల్లి గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శివ శంకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సారథ్యం ర్యాలీలో పాల్గొనాలి

కాజులూరు: అమాలాపురంలో ఈనెల 25న జరగనున్న సారథ్యం ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు. బుధవారం శంకరనారాయణ తదితర నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులకు హాజరుకావాలని సూచించారు.

రైతులకు టార్పాలిన్, స్ప్రేయర్ పంపిణీ

కె.గంగవరం: మండంలోని కూళ్లలో తానా చేపడుతున్న రైతు కోసం తానా కార్యక్రమంలో భాగంగా అదే గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చిట్టూరి వెంకట సూర్యప్రకాశరావు తన పుట్టినరోజు సందర్భంగా టార్పాలిన్‌లు అందజేశారు. తానా సేవలను రైతులు అభినందించారు.

భీమేశ్వరుడిని దర్శించిన వేద విద్యార్థులు



భీమేశ్వరాలయంలో మైసూర్ దత్త పీఠం వేద విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయాన్ని మైసూర్ దత్త పీఠం వేద పాఠశాల విద్యార్థులు బుధవారం దర్శించుకున్నారు. గణపతి సచ్చిదానంద స్వామిజీ శిష్యులైన వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేద విద్యనభ్యసిస్తున్న చిన్నారులు ఆలయాన్ని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు.

సన్నాహక సమావేశాలు

కపిలేశ్వరపురం: బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేతలు మండలంలోని గ్రామాల్లో సన్నాహక సమావేశాలను నిర్వహించారు. కపిలేశ్వరపురలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు నామాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 25న అమలాపురంలో మాధవ్ పర్యటించనున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చాత్రాతి జానకి రాంబాబు, కేవీవీ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి ఉధృతి



కోటిపల్లి ఫెర్రిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

కె.గంగవరం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌కు భారీగా వరద చేరుతుంది. వరద నీటిని కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదలడం వల్ల కోటిపల్లిలో వరద పెరుగుతుంది. కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు గోదావరి ఉగ్రరూపం దాల్చింది. బుధవారం ఉదయం నుంచి పెరిగిన గోదావరి సాయంత్రం కోటిపల్లిలో ఉధృతి నిలకడగా ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మరో రెండు అడుగులు పెరిగితే కోటిపల్లిలోని మత్స్యకార కాలనీ వరద నీటిలో చిక్కుకుంటుందని స్థానికులు అంటున్నారు. మరోవైపు ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న ఉద్యానవన పంటలు నీటమునిగాయి.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీదే గెలుపు

- మాజీ మంత్రి గొల్లపల్లి
- గ్రామాల్లో ఉత్సాహంగా ఇంటింటికీ వంచన



పడమటిపాలెంలో పార్టీ జెండా ఎగురవేసిన మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీదే గెలుపు అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం చింతలమోరి గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం పేరాబత్తుల నాగరాజు ఇంటి దగ్గర మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మజీ అధ్యక్షతన జరిగింది. సూర్యారావు పాల్గొని మాట్లాడుతూ ఇంత తక్కువ కాలంలో ప్రజల నుంచి చీత్కారాలు ఎదుర్కొన్న ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. మాజీ సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను ప్రస్తుత సీఎం చంద్రబాబు దూరం చేశారని ప్రజలు చాలా బాధతో ఉన్నారన్నారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రతినిధి తాడి సహదేవ్, గుర్రం జాషువా, మోకా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పడమటిపాలెంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మంద సత్యనారాయణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మండల జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. నాయకులు కటకంశెట్టి ఆదిత్య, కట్టా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కొల్లాబత్తుల సీతామహాలక్ష్మి, తాడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై సూచనలు



కందులపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెంలో బుధవారం ఏఓ మణిదీప్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సమాయ సంచాలకులు రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన రైతులకు వరి పంటలో సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కాండం తొలుచు పురుగు జీవిత చక్రం చిత్రాలతో బోర్డుపై రాసి వివరించారు. రెక్కల పురుగులు తమ గుడ్లు వరి కొన భాగాల్లో పెట్టడం జరుగుతుందన్నారు. వీటిని వేప నూనెతో నివారించవచ్చన్నారు. రామచంద్రపురం ఏడీఏ నాగకుమార్ మాట్లాడుతూ, ద్రవ రూప జీవ ఎరువు అయిన ఫాస్ఫో బ్యాక్టీరియా భూమిలో లభ్యం కాని భాస్వరం కరిగించి మొక్కకు అందించి వాటి ఎదుగుదలకు అవసరమైన హార్మోన్లు ఉత్పత్తి అయ్యేలా చేస్తుందన్నారు. వర్మీ కంపోస్టు సేంద్రియ ఎరువుతో కలసి విత్తనాలు నాటినప్పుడు లేదా నాటిన వారంలోపు పొలంలో చల్లాలని వివరించారు. డ్రోన్లు 80 శాతం రాయితీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెల్ల పీఏసీఎస్ చైర్మన్ వైట్ల రాజబాబు, వీఏఏ శ్రీరామ్, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన

కె.గంగవరం: మండంలోని శివల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఖరీఫ్–2025 శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ కొండం తొలుచు పురుగు, ఆకుచుట్టు పురుగు, లార్వా, రెక్కల పురుగులను గుర్తించడం, నివారణ కార్యక్రమాల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. రామచంద్రపురం ఏడీఏ నాగకుమార్ మాట్లాడుతూ, నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నీటి సంఘం అధ్యక్షుడు బలుసు శివప్రసాద్, గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వీఏఏ దేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాలాజీ, సత్యవేణి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామి వారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన అర్చకుడు పెద్దింటి వెంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్టు దర్శనం, అలాగే లడ్డు ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది.